

'వీల్స్ ఇండియా' ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ తదితరులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 8 మంది వీల్స్ ఇండియా కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సముద్రాల రామారావు శనివారం తెలిపారు. కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల్లో వీల్స్ ఇండియా కంపెనీ ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు రామచంద్రపురం నుంచి 14 మంది డిప్లమా మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు వెళ్ళగా వారిలో ఎనిమిది మంది ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 2.4 లక్షల జీతం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

పిఠాపురంపైనే అందరి చూపూ

- బరిలో కీలక నేతలు
- పోటీకి జనసేనాని సన్నాహాలు
- ముద్రగడను దింపేందుకు వైసిపి యత్నం





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిఠాపురం నియోజకవర్గంలో మారుతున్న పరిణామాలు రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ఈ అసెంబ్లీ స్థానంపై అందరి కన్ను పడింది. కీలక నేతలు ఇక్కడి నుంచే బరిలోకి దిగేందుకు ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దానికి తగ్గట్టుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన ఇక్కడ నుంచి బరిలో నిలుచుంటారని ఆ పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. దానికి అనుగుణంగా పార్టీ కార్యాలయంతోపాటు ఇతర ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ బరిలో ఉంటే ఆయనకు తగిన అభ్యర్థిని రంగంలోకి దించాలని వైసిపి కూడా భావిస్తుంది. దానికి అనుగుణంగానే కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ బరిలో దిగే అవకాశం ఉంటుందని ప్రచారం మొదలైంది. ఇప్పటికే వైసిపి ఆ దిశగా లీకులు కూడా ఇస్తుంది. త్వరలోనే ముద్రగడ వైసిపి తీర్థం పుచ్చుకుని పోటీలో ఉంటారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

ఈ నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల ఓటర్లున్నారు. ఇందులో దాదాపుగా 90 వేలకు పైనే కాపు ఓటర్లున్నారు. కాపులు అత్యధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఎక్కువ సార్లు అదే సామాజిక వర్గానికి చెందిన నాయకులు గెలుపొందారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం గతంలో విజయం సాధించడంతోనే కీలక నేతలు ఇక్కడ పోటీకి సై అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి జనసేనకు సునాయాసంగా విజయం వరించే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. దానికే తొలుత భీమవరం అనుకున్న పవన్ వివిధ సర్వేల తర్వాత పిఠాపురం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. దీంతో గత రెండు రోజులుగా పిఠాపురం నియోజకవర్గ సమీకరణాలు మారడంతో అనూహ్యంగా ముద్రగడ తెరమీదకు వచ్చారు. తొలుత పవన్ వచ్చి కలిసిన తర్వాత ముద్రగడ జనసేనలో చేరి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అందుకే ఇప్పటి వరకు ముద్రగడ, ఆయన అనుచరులు ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనేది పరిశీలకుల భావం. రెండు రోజుల క్రితం ముద్రగడ విడుదల చేసిన లేఖతో జనసేనలో చేరే అవకాశం లేదని తేలిపోయింది. పవన్ పోటీపై ఊహాగానాల నేపథ్యంలో ఆయనపై ముద్రగడను పోటీలో నిలిపేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు కొనసాగిస్తుంది. ఆయన వైసిపిలోకి వస్తే కాపులపై ప్రభావం చూపిస్తుందని, తద్వారా పవన్‌ను ఓడించొచ్చుననే అంచనాతో అధికార పార్టీకి చెందిన నేతలు ఆయనతో చర్చలు జరుపుతున్నారు. కొంతకాలం క్రితం కాకినాడ ఎంపీ వంగా గీతను ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా నియమించిన తరువాత స్థానిక ఎంఎల్‌ఎ పెండెం దొరబాబును కలుపుకుని ఆమె పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మారుతున్న సమీ కరణాల్లో భాగంగా ఆమెను ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించి వేరే చోట అవకాశం ఇవ్వాలనే ఆలోచన అధిష్టానం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎవరు పోటీ చేసినా పిఠాపురం నియోజకవర్గ ఓటర్ల విలక్షణ తీర్పుకు సిద్ధం కాక తప్పదు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రభుత్వ ప్రాధాన్యత

మంత్రి పినిపే విశ్వరూప్



అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అభివృద్ధి, సంక్షేమానికే తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలో శనివారం స్థానిక సర్పంచ్, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కమిడి చిన్నవరాజు అధ్యక్షతన జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి విశ్వరూప్ ఎంపిటిసి బొమ్మి ఇజ్రాయిల్ తో కలిసి పాల్గొని ప్రారంభోత్సవాలు చేశారు. ఉప్పలగుప్తం మెయిన్‌లో రూ.38 లక్షలతో నిర్మించిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, పెద్దపూటలో రూ.10 లక్షలు నిర్మించిన కల్వర్టు, రూ.15 లక్షలతో నిర్మించిన జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలు, మధురపేటలో రూ.25 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఆర్ ట్యాంకు, అదే గ్రామంలో రూ.16.50 లక్షలతో నిర్మించిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి విశ్వరూప్ ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలాన్ని అందించిన ఎంపిటిసి చిక్కం త్రినాథ బాలయ్య దంపతులను మంత్రి విశ్వరూప్ ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే పెదగాడపల్లిలో సర్పంచ్ జి.వెంకట మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూ. కోటి 49 లక్షల వ్యయంతో నిర్మించిన తరగతి భవనాలను కూడా మంత్రి విశ్వరూప్ ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు.

ఉప్పలగుప్తంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాలును ప్రారంభించిన సందర్భంగా మంత్రి విశ్వరూప్, ఎంపిటిసి ఇజ్రాయిల్ లతోపాటు ప్రజా ప్రతినిధులను నాయకులను అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సాధే శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ లు యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యల రాజ్ కుమార్, ఉప సర్పంచ్ మోకా శ్రీను, ఎంపిటిసి సభ్యులు వంగా గిరిజ కుమారి, కొంకి ఏడుకొండలు, చిక్కం త్రినాథ, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరాటం చేస్తున్న రైతులకు అండగా నిలవాలి



అంగర ధర్నాలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

ఢిల్లీలో పోరాడుతున్న రైతులకు అండగా భారత కార్మిక సంఘాల ఐఎఫ్‌టియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంటపల్లి భీమశంకర్ లు అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలం అంగర గాంధీ సెంటర్ వద్ద రైస్ మిల్ జట్టు కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం వ్యవసాయ నల్ల చట్టాలను తీసు వచ్చి సంవత్సర కాలంగా పోరాటం చేసిన రైతులకు మోడీ ఇచ్చిన వాగ్దానాలను నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ కారణంగా మరలా ఢిల్లీలో తమ హక్కుల సాధన కోసం పంట కిట్టుబాటు ధర హక్కు కోసం ఆందోళన చేస్తుంటే రైతులు పై మోడీ ప్రభుత్వం భాష్ప వాయు ప్రయోగించి పెద్ద ఎత్తున లాఠీ చార్జీ చేయడం తో ఒక యువ రైతు మరణించాడన్నారు. గత పోరాటంలో కూడా 800 మంది రైతులు హత్యకు కారణమైనటువంటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే దేశానికి తీవ్రమైన అన్యాయం చేసిన వారుమవుతామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంటపల్లి భీమశంకర్, రైస్ మిల్ జట్టు కార్మిక సంఘం నాయకుడు కొమ్మిశెట్టి లోవరాజు, పదం గోవిందు, గొల్లగూటి చిన్న, మేడిశెట్టి శ్రీనివాస్, ముగ్గిన బోరయ్య ,చల్లా శ్రీనివాస్, తదితరులు జట్టు కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థుల సత్కరిస్తున్న జెడ్‌పిటిసిసభ్యుడు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అయినవిల్లి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. నేదునూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అటల్ ల్యాబ్ టింకరింగ్ సైన్స్ ప్రదర్శన హెచ్‌ఎం పిఎన్‌వివి.ప్రసాద్ రావు అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు విచ్చేసి విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్ట్‌లను తిలకించారు. అలానే జనవరిలో విజయవాడలో జరిగిన దక్షిణ భారత వైవిజ్ఞాన ప్రదర్శనలో రోడ్డు ఫ్యూచర్ టెక్నాలజీ ప్రాజెక్ట్ ను నేదునూరు హై స్కూల్ విద్యార్థులు పి. గౌతం, పి. గణేష్ తయారుచేసి రాష్ట్ర స్థాయి బహుమతి సాధించినారు ఈ విద్యార్థులను పాఠశాల తరపున సన్మానించినారు హై స్కూల్ అభివద్ధి నిమిత్తం ఎంపిటిసి సభ్యుడు-1 కల్లేపల్లి సుబ్బరాజు రూ.10వేలు ఆర్థిక సహాయం చేశార. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసంశెట్టి తాతాజీ, పీసీ కమిటీ ఛైర్మన్ పి. వెంకటరమణ, వైస్ ఛైర్మన్ కె.శ్రీదేవి, బండి శ్రీరాములు, తిప్ప చైతన్య, వస్తా రామారావు సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై చర్యలకు డిమాండ్



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధుల, అధికారులు

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల సర్వసభ్య సమావేశానికి గైరాజరవుతున్న అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతితులు డిమాండ్ చేశారు. శనివారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వైస్ ఎంపిపి-2 సాన బోయిన నాగేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు నేల కిషోర్ కుమార్ మాట్లాడుతూ మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి సర్వ సభ్య సమావేశానికి అధికారులు అందరూ పూర్తి స్థాయిలో రావడంలేదని అలా రాని వారి పై ఇంతవరకు తీసుకున్న చర్యలను తెలియజేయాలని ఎంపిటిసి సభ్యులు సంగాని మునీంద్ర, గెద్దాడి గుణ వేణు కుమార్ సభ దష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ సమావేశానికి రానివారికి నోటీసులు పంపాలని ఎంపిడిఒ కార్యాలయం సిబ్బందికి తెలిపారు. అనంతరం వివిధ శాఖల్లో జరుగుతున్న కార్యక్రమ వివరాలను అధికారులు సభలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీదేవి , ఏడిద సుబ్బు, నాతి సత్య నారాయణ,పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

జి.మూలపొలం గ్రామ పంచాయతీ పరిధిలో యర్రగురువు -భీమ్ నగర్ గ్రామంలో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద 75వ వార్షకోత్సవం ఘనంగా జరిగింది అంబేద్కర్ యువజన సంఘం, గ్రామస్తులు, స్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్ గిడ్డి ఆనందరావు ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఎం.ఎస్.అమీన్, జి.గంగాధర రావు పర్యవేక్షణలో ఈ వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్కూల్ అభివద్ధి కొరకు 30మంది దాతలు సహకారంతో రూ. 1లక్ష విరాళం అందజేశారు. గుత్తెనదీవి గ్రామానికి చెందిన అడ్డాల సతీష్ కుమార్ స్కూల్ వరండా గ్రిల్స్ నిర్మించటాని రూ 20వేలు అందజేశారు. వీరందరిని మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు ఎన్.కొండా రెడ్డి, తిరుమలరావు హాజరైయ్యారు. ఇతర గ్రామంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఆహ్వానించారు. కార్యక్రమంలో వత్సవాయి రామకృష్ణ వర్మ, వైసిపి జిల్లా జనరల్ సెక్రటరి రేవు అప్పారావు, మోర్త చిన్నా,కాటం సత్తిరాజు, మందపాటి భైరవస్వామి, జగడం సత్తిబాబు,రేవు అప్పలస్వామి, కాశి ధనలక్ష్మి పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహనా ర్యాలీలు

జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోపై శనివారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పాల్గొన్న పల్స్ పోలియో ఆవశ్యకతను వివరించారు.



ముమ్మిడివరంలో పల్స్‌పోలియోపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-యంత్రాంగం

ముమ్మిడివరం చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవశ్యకం అని ముమ్మిడివరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని యోగితా లక్ష్మీ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక యుపిహెచ్‌సి వద్ద శనివారం ఆరోగ్య కార్యకర్తలు మరియు సిబ్బంది ఏర్పాటు చేసిన పోలియో చుక్కల పై అవగాహన ర్యాలీ ని వైద్యాధికారిని యోగితా లక్ష్మీ జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ తప్పని సరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ ర్యాలీ జాతీయ రహదారి 216 పై పోలమ్మ చెరువు(బుద్ధ పార్కు) వరకు సాగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సంపూర్ణ ఫార్మసిస్ట్ సత్యనారాయణ మరియు ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్ల అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** లూటుకుర్రు పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ డివి.సత్యం, డాక్టర్ స్పందన ఆధ్వర్యంలో శనివారం రాజోలు రోటరీ క్లబ్ పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి పరిధిలో అయిదేళ్ల లోపు పిల్లలు 3065మంది ఉన్నారని, 22 పోలియో బూత్ లు ఏర్పాటు చేశామని, 33 టీంలు నియమించామన్నారు. నగరం పిహెచ్‌సి పరిధిలో అయిదేళ్ల లోపు చిన్నారులు 3097మంది ఉన్నారని, 21 పోలియో బూత్‌లు ఏర్పాటు చేశామని, 84 మంది సిబ్బందిని నియమించామని వైద్యాధికారులు డాక్టర్ పిజె.ప్రశాంత్, డాక్టర్ కె.స్వర్ణ లత తెలిపారు. అయిదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.



లూటుకుర్రు పిహెచ్‌సి పరిధిలో అవగాహనా ర్యాలీ

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

అమరావతి సచివాలయం నుంచి శనివారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ అంశాలు, రిసర్వే ఫేజ్ 3, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలు వాటి రిజిస్ట్రేషన్ తదితర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు ఇతర జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. సమావేశ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో దాళ్వా వరి సాగులో భాగంగా డ్రయిన్లలో వధాగా పోయే నీటిని అరికట్టి శివారు పంటచేలకు పూర్తిస్థాయిలో నీటిని అందించడానికి డ్రయిన్లపై క్రాస్ బండ్ల నిర్మాణం, ఇంజిన్ల ఏర్పాట్ల కు ప్రభుత్వానికి నివేదించమన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే క్రాస్ బండ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రానున్న వేసవికాలంలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈనెల 6న ఉదయం 7 గంటల నుంచి జిల్లాలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను ఒకేసారి శుభ్రపరిచే కార్యక్రమం జరుగుతుందని, దానికి తగిన కార్యచరణ రూపొందించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మార్చి 3న జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు ,గ్రామ వార్డు సచివాలయాలు ,స్కూళ్ల లో ఏర్పాటుచేసిన పోలియో బూత్ ల లో ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో టీకా(నోటి టీకా) వేయడం జరుగుతుందని, ప్రజలందరూ తమ పిల్లలకు పోలియో టీకా తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ ప్రజలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెసి నుపూర్ అజయ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, పీడీ డ్వామా మధుసూదన్, పీడీ డి ఆర్‌డిఎ శివశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

వెంకన్న ఆలయానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి స్థానిక దాతలు దాసరి వెంకట్రావు (బాబూరావు), దాసరి గణేష్ కుటుంబాల వారు శనివారం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. నూతనంగా పునరుద్ధరణ చేసిన విమాన గోపురానికి వేయించిన రంగుల ఖర్చుల నిమిత్తం ఈ విరాళాన్ని అందించినట్లు దాతల కుటుంబ సభ్యులు తెలిపారు.




సర్పంచ్ రాంబాబు అందజేసిన గొడుగులతో ఎఎన్‌ఎంలు, ఆశాలు

ఎఎన్‌ఎంలు, ఆశాలకు గొడుగుల వితరణ

ప్రజాశక్తి-ఆలమూరు

గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో శనివారం ఎఎన్‌ఎంలకు, ఆశా వర్కర్లకు గొడుగులు వితరణ చేశారు. వేసవిని దృష్టిలోపెట్టుకుని ఎండలు అధికంగా ఉండడంతో ఎఎన్ ఎంలకు, ఆశా వర్కర్లకు రోగుల వద్దకు వెళ్లి సేవలందించే సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందుకే గొడుగులు అందజేశామని ఆయన తెలియజేశారు.

కార్టూన్'నిజం'



'రీ సైక్లింగ్ ఆఫ్ యూస్డ్ టెండర్ కోకోనట్' కు తృతీయ బహుమతి



ప్రశంసాపత్రం అందుకుంటున్న గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-అంబాజీపేట

కొత్తపేటలో జరిగిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన రీసైక్లింగ్ ఆఫ్ యూస్డ్ కోకోనట్ ప్రాజెక్ట్‌కు జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ ఈ ప్రాజెక్టు తయారు చేసిన 9 వ తరగతి విద్యార్థులు చొల్లంగి హేమా విజయలక్ష్మి, దొంగ బాల అపర్ణ మరియు గైడ్ టీచర్ ఎంఎస్ఎస్.కుమారీలను అభినందిస్తూ ప్రశంస పత్రాలను అందజేశారు. అనతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పారిశ్రామిక మనస్తత్వాన్ని పెంపొందించడానికి ప్రాజెక్టులు ఉపయోగపడతాయన్నారు. హెచ్ఎం కె.శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపిటిసి విత్తనాల భవాని, ఉపసర్పంచ్ బి.రాంబాబు, నాయకులు ఎంఎం.శెట్టి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సూర్యనారాయణ, విత్తనాల ఇంద్రశేఖర్, మరియు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

జెడ్‌పి మాజీ ఛైర్మన్ నామనకు పలువురు పరామర్శ



కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిసున్న మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి -మామిడికుదురు

మంగటవల్లిలో సతీ వియోగంలో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నామన రాంబాబుని శనివారం మాజీ మంత్రులు పరామర్శించారు. శాసనమండలి ప్రతిపక్ష నాయకులు యనమల రామకృష్ణుడు, మాజీ హోం మంత్రి, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎంఎల్ఎ చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి అంజిబాబు, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు డొక్కా నాథ్ బాబు, టి డి పి అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్ తదితరులు నామన రాంబాబు సతీమణి నామన కృష్ణవేణి చిత్రపటం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

శివరాత్రి ఏర్పాట్లపై ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి-రామచంద్రపురం


కోటిపల్లిలో మహాశివరాత్రి ఏర్పాట్లపై రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్ అధికారులతోనూ ప్రజాప్రతినిధులతోనూ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోటిపల్లి మహాశివరాత్రికి జిల్లా నలుమూలల నుండి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు శాంతిభద్రతలకు అదనపు పోలీసు బలగాలు ఏర్పాటు చేయాలని డిఎస్‌పికి సూచించారు. అదేవిధంగా భక్తులకు నిరంతరం తాగునీరు అందేలా ఏర్పాట్లు చూడాలని ఆర్డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఆర్‌టిసి ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పడుతోపాటు అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని తెలిపారు. గౌతమీ గోదావరిలో స్నానములు ఆచరించే రేవు వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచాలని క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండల అధికారులకు గ్రామపంచాయతీ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి, గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ, ఇఒ శ్రీదేవి, ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పిల్లి శ్రీనివాసరావు, సిఐ దొరరాజు, ఎస్ఐ జానీ బాషా, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఆట స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న జెడ్‌పిఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా వ్యాయమ విద్యా పర్యవేక్షణ అధికారి జి.భానుమూర్తి, తూర్పు గోదావరి ఎస్.జి.ఎఫ్.ఐ సెక్రటరీ బండారు వీరవెంకట సత్య వరప్రసాద్ సందర్శించారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెంట్ స్లో భాగంగా బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్ ను పరిశీలించారు. స్కూల్ యొక్క గ్రౌండ్ లను పిఎం.సి నిధులు గురించి హెచ్‌ఎం వీధి సురేష్ బాబును అడిగి తెలుసుకొని సంతప్తిని వ్యక్తం చేశారు. స్కూల్ ఆఫ్ ఎక్స్ లెంట్ కి ప్రభుత్వానికి తెలియజేస్తానని అన్నారు.

మేదర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మేదర కార్మికులతో మాట్లాడుతున్న సూర్య ప్రకాష్

ప్రజాశక్తి -రామచంద్రపురం

మేదర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ హామీ ఇచ్చారు. ఆయన శనివారం పట్టణం లోని 23వ వార్డు మేదర్ల వీధిలో 'గడప.. గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. మేదర్ల సంఘం తో ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కారం అయ్యే విధంగా అధికారులతో పలు సూచనలు చేశారు. సిఎం జగన్ చేస్తున్న అభివృద్ధి పథకాలు గురించి ప్రజలకి వివరిం చారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని ఆయన కోరారు. ప్రతి నెలా 1వతేదీన 6 గంటలకే పెన్షన్ అందిస్తున్న ప్రభుత్వం వైఎస్ఆర్ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఛైర్‌పర్సన్ కొలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరావు, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వార్డు కౌన్సిలర్ మున్సిపల్ చీఫ్ విప్ వాడ్రేవు సాయి ప్రసాద్, మానేపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న తోట తదితరులు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పెద్ద కాలువ వద్ద గల మహత్మ జ్యోతిరావు పూలే విగ్రహం పక్కన మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన సావిత్రి బాయి పూలే విగ్రహం, స్థానిక వాణిమహల్ సెంటర్లో దివంగత వంగవీటి మోహనరంగా, జ్యోతి రావు పూలే, మాజీ ఎంఎల్ఎ వివిఎస్ఎస్.చౌదరి విగ్రహాల ఏర్పాటుకు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మున్సిపల్ ఛైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ ఇప్పటికే పట్టణ ప్రజల కోరిక మేరకు అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, గ్రంధి శ్రీనివాసు, వివిధ సామాజిక వర్గాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతరం పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థిగా రాజు



నందికోళ్ల రాజు

ప్రజాశక్తి-మండపేట

పట్టణానికి చెందిన నందికోళ్ల రాజుకు నవతరం పార్టీ ఎంఎల్ఎ టికెట్ ను పార్టీ ఫౌండర్, నేషనల్ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం కేటాయించారు. శనివారం మండపేటలో ఏర్పాటు చేసిన మీడియాతో సమావేశంలో రాజు మాట్లాడుతూ తనకు టిక్కెట్ వచ్చిన విషయాన్ని తెలిపారు. ఇప్పటికే తాను నవతరం పార్టీ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నానని తన సేవ లను గుర్తించి త్వరలో జరగబోయే ఎన్నికల్లో మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఎంఎల్ఎ సీటు ఇచ్చినట్టు చెప్పారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని జగన్నాథపురంలో ఒక వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. తానెం విష్ణు భార్య, లక్ష్మి.(29) శుక్రవారం రాత్రి ఉరిపోసుకుని మృతి చెందినట్లు భర్త విష్ణు తెలుపుతున్నాడని చెప్పారు. ఆమెపై అనుమానంతో భర్త విష్ణు కొట్టినందు వల్లే ఆమె చనిపోయిందని, ఉరి తాడును తానే కోసినట్లు తెలుపుతున్నాడని పోలీసులు తెలిపారు. పోలీసులు అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

గోదావరి కాటన్ బ్యారేజ్‌పై శనివారం సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులను కారు ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. కొవ్వూరు రూరల్ పోలీ సులు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం మండలం లోని మద్దూరు లంక గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఎవరి సైకిల్‌పై వారు క్యాటన్ బ్యారేజ్ మీదుగా పాఠశాలకు వెళుతుండగా రాజమండ్రి వైపు నుంచి వస్తున్న కారు వారి సైకిళ్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరొక విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు.

గంజాయి కేసులో యువకులకు రిమాండ్

ప్రజాశక్తి-గోపాలపురం

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారిని కొవ్వూరు కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు తెలిపారు. శనివారం గోపాల పురం పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ మూడు గంటల సమయంలో గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జగన్నాథపురంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రా నికి చెందిన సికె.గౌతం రాజు, కెఎస్.వినయ్ కుమార్ విశాఖ జిల్లా ఏజెన్సీ నుంచి 4.290 కేజీల గంజాయి తరలిస్తుండగా అదుపులోనికి తీసుకున్నారు. వారిని కొవ్వూరు కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్టు డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో సిఐ పి.బాల సురేష్ బాబు, ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

రూ.7.5 లక్షల అపహరణ నిందితుల అరెస్ట్, సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-గోపాలపురం

కాకినాడలో అపరాలు అమ్ముకుని తెలంగాణ వెళుతున్న వ్యక్తి బ్యాగ్‌లో రూ.7.50 లక్షల నగదు అపహరించిన వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు తెలిపారు. శనివారం గోపాల పురం పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణకు చెందిన వైట్ల సాయి బాబా అపరాల వ్యాపారి వద్ద గుమస్తా. అపరాలను కాకినాడకు తీసుకు వచ్చి అమ్మగా వచ్చిన డబ్బులు రూ.7.5 లక్షను బ్యాగులో పెట్టుకుని కాకినాడ నుంచి రాజమండ్రి వచ్చారు. సాయిబాబాకు పరిచయస్తులైన మండపేట గ్రామానికి చెందిన ఎర్నేటి విజయ కుమారి, ఆమె అల్లుడు మాడ మణికుమార్ ఆయనకు కనిపించారు. బ్యాగులో డబ్బులు ఉన్న విషయం గుర్తించారు. వారు కూడా తెలంగాణ వస్తామని చెప్పి అందరూ కలిసి రాజమండ్రిలో బస్సు ఎక్కారు. 29వ తేదీ తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్ వద్దకు వచ్చేసరికి సాయిబాబా నిద్రలో ఉండగా వారిద్దరూ డబ్బుతో ఉన్న బ్యాగు అపహరించి దిగిపోయారు. దీంతో సాయిబాబా గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఒకటవ తేదీన ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిఐ పి.బాలసురేష్ బాబు, ఎస్ఐ కె.సతీష్ కుమార్ నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 7.45 లక్షలు రికవరీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోపాలపురం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం గోపాలపురం శివారు పొగాకు బోర్డు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..చాగల్లు గ్రామానికి చెందిన వై.ఆంజనేయులు (32) బైకుపై జంగారెడ్డిగూడెం వెళుతుండగా గోపాలపురం పొగాకు బోర్డు సమీపంలో ఉన్న మలుపు వద్ద వెనుక నుంచి లారీ బలంగా ఢీ కొట్టంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఆంజనేయులకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

రెండు బైకులు ఎదురు, ఎదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి 8 గంటలకు నల్లజర్ల ప్రకాశరావుపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సింగరాజుపాలెం గ్రామానికి చెందిన దయ్యాల సతీష్ నల్లజర్ల వైపు బైకుపై వెళుతుండగా తణుకు గ్రామానికి చెందిన కమలాకర్ నల్లజర్ల వైపు నుండి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్నారు. అతి వేగంగా ఒకరిని ఒకరు ఢీకొనడంతో కమలాకర్ కుడికాలు మూడు చోట్ల విరిగింది. వెంటనే స్థానికులు స్పందించి 108లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బోటు తిరగబడి మత్స్యకారుని మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు సముద్రంలో బోటు తిరగబడి మత్స్యకారుడు మతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ కెఎం.జోషి తెలిపిన వివరాలు ఇవి. అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సముద్రంలో వేట నిమిత్తం శనివారం ఉదయం పంతాడి పెంటయ్యకు చెందిన ఫైబర్ ఇంజన్ బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు.చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప తీరం సముద్రంలో వారు వేటాడుతుండగా సముద్రపు అలలకు బోటు తిరగబడడంతో నక్కా రామేశ్వరానికి చెందిన కొప్పనాతి కోదండం(40) ప్రమాదవశాత్తు నీట మునిగి మతి చెందాడు. మిగిలిన ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారని తెలిపారు.మతుని సోదరుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పెరిగిన పొలిటికల్ హీట్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఒక వైపు అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నిర్వహణ తదితర ఏర్పాట్లపై కసరత్తు పూర్తి చేసిన విషయం విదితమే. మరో వైపు అధికార విపక్ష పార్టీలు ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాయి. మరి కొన్ని స్థానాలు ప్రకటించాల్సి ఉంది. ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ఆయా పార్టీల అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికార పార్టీ ఇప్పటికీ కొన్ని స్థానాల్లో సిట్టింగ్‌లకు సైతం స్పష్టత ఇవ్వకపోవటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. కొత్త అభ్యర్థులను తెరపైకి తీసుకొస్తారా..? లేదా తుది దశలో వారికే కేటాయిస్తారా..? అనే చర్చ జరుగుతోంది. అభ్యర్థులు ఖరారైన స్థానాల్లో ఎన్నికల కోడ్‌కు ముందే హోరెత్తిన ప్రచారం ప్రజలను విస్తు గొలుపుతోంది. మరోవైపు జనసేన, టిడిపి నేతల మధ్య జిల్లా స్థాయిలో వార్ మొదలైంది. రాజమహేంద్రవరం రూరల్ స్థానం ఆశించి భంగ పడిన జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ నిరసన ర్యాలీ సైతం నిర్వహించడంతో ఆ రెండు పార్టీల పర్సపర సహకారంపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. మరోవైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం జోరుగా జరుగుతోందని తెలుస్తోంది. ధరలు, ఛార్జీలు, పన్నుల భారాల నేపథ్యంలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న అధికార వైసిపి, అధికార పార్టీని ఓడించటమే లక్ష్యం అంటూ జతకట్టిన జనసేన-టిడిపి ఏ మేరకు సఫలీకృతం అవుతాయో వేచి చూడాల్సి ఉంది.

తప్పుల తడకలతో ఇబ్బందులు

పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో తగిన సౌకర్యం కల్పించడం లేదని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. పేదలకు ఇచ్చిన పట్టాల్లో పేర్లు, సర్వే నంబర్లు, ప్లాట్ నెంబర్, హద్దులు తప్పుగా ఉండడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత రిజిస్ట్రేషన్‌కు ఇచ్చిన తేదీన కార్యాలయానికి వచ్చినా తిరస్కరణకు గురవుతుండటంతో లబ్ధిదారులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మరోపక్క గ్రామాల్లో కరెంట్ కోతల కారణంగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలు లేకుంటే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్తున్నారు. కాగా రోజూ సర్వర్ సమస్యతో నిరీక్షించాల్సి వస్తోందని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాదైనా కాల్వల ఆధునికీకరణ సాధ్యమేనా

రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని జిల్లా రైతాంగం అభిప్రాయ పడుతోంది. గోదావరి నదీ పరీవాహక ప్రాంతం కావడంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విదితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి పలుమార్లు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్థతను వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. రబీ సాగుకు సాగునీటి ఇబ్బందులు పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. సాగు నీటి సలహా మండలి సమావేశంలో ప్రతిపాదించిన నిధులు ఇప్పటిద వరకూ విడుదలకు నోచుకోలేదు. మరోవైపు ఈ ఏడాది డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు చేస్తారా.? లేదా అనే సందేహమూ వెంటాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సాగునీటి



ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు ఈ వేసవిలో కాల్వల ఆధునీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతోంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ఎండలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి వేడి గాల్పులు ఊపందుకోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్చి ప్రారంభంలోనే ఇలా ఉంటే మే నెలలో తార స్థాయికి చేరతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చొరవ చూపి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

లైసెన్సుల జారీపై వ్యాపారులకు అవగాహన


ప్రజాశక్తి-మండపేట

లేబర్ లైసెన్స్ జారీలపై వ్యాపారులకు శనివారం అవగాహన కల్పించారు. వ్యాపారులు వారి లైసెన్సులు రెన్యువల్ చేసుకోవడంతో పాటు కొత్త లైసెన్సులు విధిగా పొందాలని సహాయ కార్మిక కమిషనర్ టి.నాగలక్ష్మి సూచించారు. వ్యాపార సంస్థలు దుకాణాలలో పని చేసే వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ విధిగా ప్రతి సంవత్సరం చెల్లించాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యాపార సంస్థలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

కేశవరం గ్రామాభివృద్ధికి కృషి: ఎంఎల్‌సి తోట

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని కేశవరం గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం వైసిపి నాయకులతో కలిసి పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పల్లపు వీధి, కోసి, రామాలయం వీధులలో పంచాయతీ సాధారణ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను, దేవుడు తాళ్ళ వీధి, ఎస్‌సి కాలనీలో వాలీబాల్ కోర్టులను ప్రారంభించారు. తొలుత దాతలు సమకూర్చిన పుస్తక కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన 345 ఇళ్ల పట్టాలను, గడప..గడపకూ కార్యక్రమంలో గుర్తించిన మరో 108 ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి, ఎంపిపి ఉండమట్ల వాసు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, పెదపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తోట, సర్పంచ్ తదితరులు

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా తహశీల్దార్లు బదిలీ అయ్యారు. శనివారం వారు బాధ్యతలు స్వీకరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆలమూరు తహశీల్దార్‌గా డివిఎన్.అనిల్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన తహశీల్దార్ కె.గోపాలకృష్ణ బదిలీపై రాజోలు వెళ్లారు. **రాజోలు** తహశీల్దార్‌గా ఎ.గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి విచ్చేశారు. అలమూరు తహశీల్దార్ గా విధులు నిర్వహించి ఇక్కడ బదిలీపై వచ్చారు. గోపాలకృష్ణ కు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మండపేట పట్టణంలోని 6 పరీక్షా కేంద్రాలు ఏడిదరోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిత్య, ఎంపిఎస్, విద్యావికాస్, విజ్ఞాన్, వైష్ణవి ఒకేషనల్ కాలేజీల్ల జనరల్ విద్యార్థులు 1553 మంది, ఒకేషనల్ విద్యార్థులు 340 మంది మొత్తం గాను 1893 మంది విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ తెలుగు, హిందీ, సాంస్క్రిట్, ఒకేషనల్ విద్యార్థులు జనరల్ ఫౌండేషన్ కోర్స్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. అయితే ఒకేషనల్ 24 మంది, జనరల్ 21 మంది మొత్తంగాను 45 మంది ఈ పరీక్షలకు గైర్హాజరయ్యారు. **ముమ్మిడివరం** మండలంలో 3 పరీక్ష కేంద్రాల్లో రెండో సంవత్సర ఇంటర్మీ డియట్ పరీక్షల్లో భాగంగా శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తార జూనియర్ కళాశాల మరియు అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 697 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 655 మంది పరీక్షకు హాజరయ్యారు. 42 మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ ఎంజిఆర్ కళాశాల్లో 281 మందికి 261మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. తార కళాశాల్లో 184 మందికి 173 మంది హాజరు కాగా 11 గైర్హాజరయ్యారు. గురుకుల పాఠశాలలో 232 మందికి గాను 221మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

గ్రామాల అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ పేర్కొన్నారు. అయినాపురం పంచాయతీ పరిధిలో శనివారం ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని,15 ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షల వ్యయంతో మోకా వారి పేట పులిమేగట్టు, పెద మెట్లంక గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. నగర పంచాయతీ పరిధిలో రూ.కోటి 50 లక్షలు (ఎంపీ ల్యాడ్స్ మరియు సిఎస్ఆర్) నిధులు వెచ్చించి నిర్మించిన దేవాలయం మరియు మల్టీ పర్పస్ కన్వెన్షన్ హాలును ఎంఎల్ఎ సతీష్ కుమార్ మరియు అమలాపురం ఎంపీ చింతా అనురాధ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జల జీవన్ మిషన్ పనులకు భూమి పూజ చేశారు. చిన కొత్త లంక గ్రామంలో సుమారు రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.19 లక్షల తో చేపట్టే నున్న జల జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోకా రామారావు, ఎంపిపి కోలా గంగా భవాని, జెడ్‌పిటిసి సభ్యుడు కుడిపూడి శివ శంకర రావు, కోలా బాబ్జి, పంచాయతీ రాజ్ జెఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా మంగళంపల్లి

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ వైసిపి నాయకులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మంగళంపల్లి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు శనివారం పలువురు అభినందనలు తెలిపారు.

స్థానికులనే ఉమ్మడి అభ్యర్థిగా నియమించాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

పి.గన్నవరం నియోజకవర్గంలో ఉండే స్థానిక అభ్యర్థిని టిడిపి, జనసేన అభ్యర్థిగా ప్రకటించాలని మండల టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం శనివారం తీర్మానించింది. అంబాజీపేట లో బాబులు గారి మిల్లు వద్ద సమావేశం జరిగింది. ఇక్కడ వ్యక్తిని నియమించిన అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి, జనసేన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 2, 3వ వార్డుల్లో 2వ రోజు శనివారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి శ్రేణులతో కలిసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటికీ పర్యటించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివద్ధి శూన్యం అన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఫైనాన్షియల్ లిటరసీ వీక్ లో భాగంగా, కొంకాపల్లి, మున్సిపల్ హైస్కూల్లో హౌబ్యాంక్ ఎసెన్షియల్ ఫర్ స్టూడెంట్స్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతిని డివిజనల్ లీడ్ మేనేజర్ శ్యాం బాబు అందజేశారు, ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, ఆర్థికపరమైన పొదుపును అలవాటు చేసుకుని, భవిష్యత్తులో ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. అందుకుగాను బ్యాంకుల్లో పొదుపు ఖాతాలను ఓపెన్ చేసుకొని అందులో మీ డబ్బులను పొదుపు చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో ఉన్న వివిధ స్కీములు గురించి అవగాహన కల్పించారు, కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘన సత్యనారాయణ, బి ఎన్ వెంకటేశ్వరరావు, కే కాంతిప్రియ, బి లక్ష్మీ తులసి తదితరులు పాల్గొన్నారు.

కమల కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశకి-ముమ్మిడివరం

పతీ వియోగంతో బాధ పడుతున్న టిడిపి నాయకురాలు మెండి కమల కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ ఎంఎల్ఎ, నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు హామీ ఇచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డు మల్లాయి పాలెం కు చెందిన కమల భర్త కోటేశ్వర రావు ఇటీవల మృతి చెందారు. దాట్ల సుబ్బరాజు, పార్టీ నాయకులు శనివారం కమల కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్ తదితరులు ఉన్నారు.

'టిడిపిని విమర్శించే అర్హత స్టాలిన్‌కు లేదు'

ప్రజాశక్తి-అంబాజీపేట

టిడిపి అధినేత చంద్రబాబును విమర్శించే అర్హత నేలపూడి స్టాలిన్ బాబుకు లేదని మాజీ ఎంపిపి టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రు ఆయన స్వగృహం వద్ద శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపిలో సభ్యత్వం లేకపోయినా జెండా మోయనప్పటికీ 2019ఎన్నికల్లో టిడిపి టిక్కెట్ ఇస్తే ఎన్నికల నిర్వహణకు పంపిన నగదు నలుగు అనుచరులు కలిపి దోచుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అప్పటి ఎంపీ పండుల రవీంద్రబాబు దగ్గర పిఎ అని చెప్పుకుని నిధులు ఇప్పిస్తానని చెప్పి వారి వద్ద నుంచి తీసుకొని సొమ్ములు సెటిల్మెంట్ చేసుకుని మోసం చేయడం తప్పు కాదా అని ప్రశ్నించారు. ఈ అయిదేళ్లలో ఎస్‌సి, ఎస్‌టి 27 పథకాలు రద్దు చేసినప్పుడు బిసి, ఎస్‌సి కార్పొరేషన్ లోన్లు రద్దు చేసినా నోరు మెదపలేని నీ అసహాయత ప్రజలకు తెలుసన్నారు. నిస్సహాయుడువైన నీవు చంద్రబాబు గురించి మాట్లాడితే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేశారు.

వివేకా హత్య కేసులో జగన్ పాత్రపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-రాజోలు

వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్ రెడ్డి పాత్రపై సిబిఐ సమగ్ర విచారణ జరపాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బోళ్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. రాజోల్లో శనివారం శ్రీనివాస్, వెంకట రమణ మీడియాతో మాట్లాడారు. సిబిఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని వారు ప్రశ్నించారు. మొదట సిబిఐ విచారణ కోరిన జగన్ రెడ్డి తరువాత వద్దు అనడం వెనుక కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సునీతమ్మ చేస్తున్న న్యాయ పోరాటంలో ఆమెకు టిడిపిఅండగా ఉంటుందన్నారు.

సర్టిఫికేట్స్ పడిపోయినవి

అల్లవరం మండలం, బెండమూర్లంకకు చెందిన మోకా దేవిక, D/o. మోకా పద్మనాభం సర్టిఫికేట్స్ పడిపోయినవి. ది. 22-02-2024వ తేదీన జిరాక్స్ నిమిత్తం పదవ తరగతి మార్క్ లిస్ట్, టిసి, స్టడీ సర్టిఫికేట్స్‌ను బెండమూర్లంక నుండి ఆటోలో అల్లవరం నెట్ సెంటర్‌కి వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

మోకా దేవిక
D/o. మోకా పద్మనాభం
డోర్ నెంబర్: 2-32, బెండమూర్లంక
అల్లవరం మండలం
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 81218072266